క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

కూకట్‌పల్లి: విద్యుత్ మరమ్మతుల కారణంగా మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ నిలిపి వేయనున్నట్లు విద్యుత్ ఏఈ శరత్‌బాబు ఓ ప్రకటనలో తెలిపారు. మాధవరం నగర్ 11 కేవీ ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ఫేజ్ 1, ఆల్విన్ కాలనీ, మాధవరం నగర్, కమలప్రసన్న నగర్‌లలో, అదే విధంగా పాపిరెడ్డినగర్ 11కేవీ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటల వరకు హనుమాన్‌నగర్, దీనబంధు కాలనీ, ఆర్పీ కాలనీ, రామకృష్ణ నగర్, ప్రగతినగర్‌లలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ఆంజనేయనగర్ ఫీడర్ పరిధిలో..

మూసాపేట: ఆంజనేయ నగర్ 11 కేవీ ఫీడర్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఎలక్ట్రికల్ ఏఈ శంకర్ తెలిపారు. మంగళవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు కేపీహెచ్‌బీ 15వ ఫేజులో, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు కైత్లాపూర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

నాగార్జున ఓనర్స్ సీడబ్ల్యూఏ అధ్యక్షుడిగా వెంకటరత్నకుమార్

భాగ్యనగర్‌కాలనీ: నిజాంపేట రోడ్డులోని నాగార్జున ఓనర్స్ సెంట్రల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షుడు వెంకటరత్నకుమార్ వన్నెంరెడ్డి, తేజస్వి రెసిడెన్సీ, జనరల్ సెక్రటరీ సుధాకర్, మారుతి ఎస్టేట్స్, కోశాధికారి లక్ష్మణరావు శ్రీమంతుల ఎన్‌హెచ్-2, వైస్ ప్రెసిడెంట్‌లుగా భాస్కర్రావు, వీడీ-ఏ, బీఎస్‌కే వర్మ, లక్ష్మీనివాస్, జాయింట్ సెక్రటరీలుగా రంగారావు, ఎన్‌హెచ్-1, ఎం. వినోద్, విడి-బి మెంబర్లుగా రవికుమార్ వర్మ, సందీప్, ఏ. శ్రీనివాసరాజులు, సతీష్, సమాధానం, ఎస్. శ్రీనివాస్, జి. కిరణ్‌కుమార్‌రెడ్డి తదితరులు ఎన్నికయ్యారు. నూతన అధ్యక్షుడు వెంకటరత్న కుమార్ కాలనీ వాసులకు శుభాకాంక్షలు తెలిపారు.

శ్రీరంగనాయక స్వామికి ప్రత్యేక పూజలు

మూసాపేట: కూకట్‌పల్లి శ్రీరంగనాయక స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వార్షికోత్సవ ఉత్సవాల్లో భాగంగా గరుడ ధ్వజారోహణం, సంతాన ప్రసాద పంపిణీ, హోమాలు వంటి పూజా కార్యక్రమాలు జరిగాయి. ఈనెల 12వ తేదీన రంగనాయక స్వామి కల్యాణం ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ఆరోగ్య ఉపకేంద్రానికి కుర్చీల అందజేత



కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీకాలనీలోని ఆరోగ్య ఉప కేంద్రం నిర్వాహకురాలికి సోమవారం కూకట్‌పల్లి జనసేన పార్టీ నాయకులు తుమ్మల మోహన్‌కుమార్ కుర్చీలను అందించారు. ఆయన మాట్లాడుతూ.. ఆరోగ్య ఉపకేంద్రానికి ప్రతి రోజు సుమారు 30 మంది వస్తుంటారన్నారు. అదే విధంగా చిన్నారులకు టీకాలు వేయించుకోవటానికి సుమారు 100 మంది దాకా వస్తుంటారని కూర్చోవటానికి కుర్చీలు లేకపోవడాన్ని గుర్తించి కుర్చీలను అందజేశామని తెలిపారు.

డిగ్రీ కోర్సులతో ఉజ్వల భవిష్యత్

కూకట్‌పల్లి: ఇంటర్ తరువాత డిగ్రీ చదివే విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉంటుందని ప్రతిభ డిగ్రీ అండ్ పీజీ కళాశాల డైరెక్టర్ యడ్ల మనోహర్‌రెడ్డి తెలిపారు. కూకట్‌పల్లిలోని ప్రతిభ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో బీఎస్సీ డేటా సైన్స్, బీఏ, బీకాం, కంప్యూటర్ అప్లికేషన్, బీబీఏ, బీసీఏ వంటి డిగ్రీ కోర్సులతో పాటు పీజీలో ఎంకాంలో అడ్మిషన్లు పొందవచ్చునని తెలిపారు. అదే విధంగా ప్రతిభ ఐఏఎస్ అకాడమీలో డిగ్రీతో పాటు మూడేళ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సును అందుబాటులోకి తెచ్చామన్నారు. ప్రతిభ డిగ్రీ కళాశాల నుంచి ప్రతి సంవత్సరం క్యాంపస్ ఇంటర్వ్యూల ద్వారా అనేక మంది ఎంఎన్‌సీ కంపెనీల్లో సైతం ఉపాధి అవకాశాలు పొందుతున్నారని తెలిపారు. మరిన్ని వివరాలకు 96182 54567.

నగదు చెల్లించిన ఇళ్లకు రిజిస్ట్రేషన్లు చేయించండి

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సోమవారం చీఫ్ కమిషనర్ ఆఫ్ లాండ్స్ నవీన్‌మిట్టల్‌ను కలిశారు. అల్లాపూర్ డివిజన్ పర్వత్‌నగర్‌లోని జీఓ.59 ప్రకారం నగదు చెల్లించిన ఇళ్లకు సంబంధించిన రిజిస్ట్రేషన్లు ఆలస్యం విషయాన్ని లిఖితపూర్వకంగా అందజేశారు. అదే విధంగా కొంతమంది లబ్ధిదారులకు అసలు విలువ కంటే ఎక్కువ నగదు చెల్లించాల్సి వస్తోందని దీనిని పరిగణలోకి తీసుకొని వారికి న్యాయం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనికి నవీన్ మిట్టల్ సానుకూలంగా స్పందించారు.

రైతు వేదిక నిధులెక్కడ.?

- నిర్మించారు.. నిర్వహణ మరిచారు..
- ఒక్కో వేదికకు ప్రతినెలా రూ.9 వేలు
- 10 నెలలుగా అందని నిర్వహణ బకాయిలు
- ఇబ్బందుల్లో వ్యవసాయ విస్తరణ అధికారులు



సాక్షి, మేడ్చల్ జిల్లా: వ్యవసాయ శాఖ సేవలు అన్నదాతలకు మరింత చేరువయ్యేందుకు ప్రభుత్వం క్లస్టర్ల వారీగా రైతు వేదికలు నిర్మించింది. సాగులో సలహాలు, సూచనలు వీటి ద్వారా అధికారులు అందిస్తున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నప్పటికీ రైతు వేదికల నిర్వహణపై ఉన్నతాధికారులకు పట్టింపు లేకుండా పోయిందనే వాదనలు వినిపిస్తున్నాయి. గత్యంతరం లేని పరిస్థితుల్లో వ్యవసాయ విస్తరణ అధికారులే సొంత డబ్బులు ఖర్చు చేయాల్సి వస్తోంది. నెలలు తరబడి రైతు వేదికల నిర్వహణ భారంగా మారుతోందని ఏఈఓలు వాపోతున్నారు.

శివారు జిల్లాల్లో..

జిల్లాలో 9 రైతు వేదికలు ఉన్నాయి. వీటి నిర్వహణ బకాయిలు రూ.8,10,000 పేరుకుపోయాయి. ఒక్కో రైతు వేదికకు ప్రతినెలా రూ.9 వేలు అందజేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. 2022 ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు 5 నెలలకు ఒక్కో రైతు వేదికకు రూ.45 వేలు అందించింది. ఆ తర్వాత నుంచి గడిచిన 10 నెలల నిర్వహణ నిధులు మంజూరు కాలేదు. ఒక్కో రైతు వేదికకు రూ.90 వేల బకాయిలు పేరుకుపోయాయి.

రైతు వేదిక నిర్వహణ ఖర్చు ఇలా..

రైతు వేదికల నిర్వహణ కోసం ఒక్కో రైతు వేదికకు నెలకు రూ.9 వేలను ప్రభుత్వం అందిస్తోంది. ప్రతి నెలా ప్రభుత్వం అందిస్తున్న రూ.9 వేలకు సంబంధించి తాగునీటి కోసం రూ.500, మరమ్మతులు, ఇతర ఖర్చులకు రూ.వెయ్యి, విద్యుత్తు ఛార్జీలకు రూ.వెయ్యి, స్టేషనరీ, జిరాక్స్ రూ.వెయ్యి, పరిశుభ్రత, కాపలాదారుడికి రూ.3 వేలు, రైతులకు శిక్షణ కార్యక్రమాలకు రూ.2,500లను ఖర్చు చేయాల్సి ఉంది.

రైతు వేదికలకు అందుబాటులో ఏఈఓలు

రైతు వేదికల్లో వ్యవసాయ విస్తరణాధికారులు(ఏఈఓలు) అందుబాటులో ఉంటారు. అన్నదాతలకు వ్యవసాయ సంబంధిత సలహాలు, సూచనలు అందిస్తారు. అవగాహన సమావేశాలు, శిక్షణ కార్యక్రమాల సమయంలో కూర్చొనేందుకు కుర్చీలు, మైక్‌సెట్ వంటి సామగ్రిని ప్రభుత్వం సమకూర్చించింది. ఇతర ప్రజోపయోగ కార్యక్రమాలు, వివిధ శాఖల సమావేశాలకు వీటిని వినియోగించుకునేందుకు అవకాశం కల్పించింది. అయితే రైతు వేదికల నిర్వహణకు 10 నెలలుగా నిధులు మంజూరు చేయకపోవడంతో ఏఈఓలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయంపై వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు సత్వరమే స్పందించి బకాయిల చెల్లింపులు.. నిధులు మంజూరు పై దృష్టి సారించాలని రైతులు కోరుతున్నారు.

చెత్తా చెదారం తొలగింపు



చెత్తా చెదారాన్ని తరలింపజేయిస్తున్న జెడ్‌సీ మమత

కూకట్‌పల్లి: కైత్లాపూర్ స్టేషన్, హెచ్‌ఎంటీ గ్రాండ్, కేపీహెచ్‌బీకాలనీలోని జీవీపీ ప్రాంతాల్లో కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ వి. మమత సోమవారం అధికారులతో కలిసి ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. రోడ్డుపై పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని సిబ్బందితో తొలగింపజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి రోజు సిబ్బంది చెత్తాచెదారాన్ని తరలించాలన్నారు. ప్రజలు కూడా ఎక్కడపడితే అక్కడ చెత్తాచెదారం వేయకుండా కార్మికులకు అందజేయాలని కోరారు.

కిషన్‌రెడ్డి, ఈటలకు శుభాకాంక్షలు



కిషన్‌రెడ్డి శుభాకాంక్షలు తెలుపుతున్న మాధవరం కాంతరావు

కూకట్‌పల్లి: బీజేపీ నూతన రథసారథిగా నియమితులైన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని, హుజూరాబాద్ ఎమ్మెల్యే, ఎన్నికల కమిటీ నిర్వహణ చైర్మన్ ఈటల రాజేందర్‌లను సోమవారం కూకట్‌పల్లి అసెంబ్లీ బీజేపీ ఇన్‌చార్జ్ మాధవరం కాంతారావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారికి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారికి కూకట్‌పల్లి నియోజకవర్గంలో చేపట్టిన ఇంటింటికీ బీజేపీ కార్యక్రమం గురించి వివరించారు. బూత్‌స్థాయిలో పార్టీ పటిష్టతకు తీసుకోవాల్సిన కార్యాచరణపై చర్చించారు.

మూసాపేట యూపీహెచ్‌సీలో ఆకస్మిక తనిఖీలు



వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లతో మాట్లాడుతన్న డీఎంహెచ్‌ఓ శ్రీనివాస్

మూసాపేట: మూసాపేట యుపిహెచ్‌సిని సోమవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి (డీఎంహెచ్‌ఓ) డాక్టర్ పుట్ల శ్రీనివాస్ ఆకస్మిక తనిఖీ చేశారు. హాజరు, ఓపీ, స్టాక్, ఏఎన్‌సీ, ఇమ్యునైజేషన్ రిజిస్టర్లను పరిశీలించారు. ఆస్పత్రిలో పరిశుభ్రత, ఫార్మసీ, ల్యాబ్‌లను కూడా తనిఖీ చేశారు. పరిశుభ్రత నిర్వహణ మెరుగుపర్చడానికి సిబ్బందికి ఆదేశాలు ఇచ్చారు. నూతనంగా నియమితులైన ఆశా కార్యకర్తలతో సంభాషించి వారికి ఆరోగ్య శాఖలోని ప్రాముఖ్యత, బాధ్యతలను వివరంగా తెలిపారు. మూసాపేట డాక్టర్ రిషితను విధుల నుంచి తొలగించినట్లు తెలిపారు. సెంటర్ స్టాఫ్, ప్రజల ఫిర్యాదు మేరకు ఆమెను తొలగించారు. డాక్టర్ రిషితను ఈనెల 6వ తేదీన కుత్బుల్లాపూర్ పరిధిలోని భగత్ సింగ్‌నగర్ బస్తీ దవాఖానాకు ట్రాన్స్‌ఫర్ చేశారు.



సమస్యలను వెంటనే పరిష్కరించాలి

మూసాపేట: ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆదేశాల మేరకు బాలాజీనగర్ డివిజన్‌లో ఇటీవల ఏర్పాటు చేసిన వార్డు కార్యాలయాన్ని సోమవారం బాలాజీనగర్ డివిజన్ కార్పొరేటర్ శిరీష బాబూరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి ఎటువంటి స్పందన వస్తున్నదని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదు చేయటానికి వచ్చిన వారితో మంచిగా మెలుగుతూ వారు తెలిపిన సమస్యలు వెంటనే పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఉచిత వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి

కార్పొరేటర్ సతీష్‌గౌడ్

మూసాపేట: గౌడ రమేష్ ఈఎన్‌టీ ఆస్పత్రి సహకారంతో శనివారం భరత్‌నగర్ జీహెచ్‌ఎంసీ కమ్యూనిటీహాలులో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్ హాజరై మాట్లాడారు. ప్రజలు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న వైద్య శిబిరాలను వినియోగించుకోవాలన్నారు. ఈ శిబిరంలో 120మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గౌడ రమేష్, ఈఎన్‌టీ ఆస్పత్రి బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ గౌడ రమేష్, డాక్టర్ హాసిని, ప్రకాష్‌రావు, మేనేజర్ శ్రీధర్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం

మోతీనగర్: అన్నిదానాల్లో కెల్లా అన్నదానం గొప్పదని అల్లాపూర్ డివిజన్ కాంగ్రెస్ యువజన విభాగం నాయకుడు పల్లపు వేణు పేర్కొన్నారు. సోమవారం నగరంలోని బంజారాహిల్స్‌లో కేన్సర్ ఆసుపత్రి వద్ద రోగులు వారి సహాయకులకు అన్నదానం నిర్వహించారు. ప్రతి నెలా రెండు సార్లు అన్నదానం పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వెంకట్, జాకీర్ పాషా, సందీప్, తదితరులు పాల్గొన్నారు.

కాలనీల్లోని సమస్యలను పరిష్కరించండి

కార్పొరేటర్ మహేందర్ మౌనదీక్ష



కార్పొరేటర్ మహేందర్‌ను దీక్ష ప్రాంగణం నుంచి తరలిస్తున్న పోలీసులు

కూకట్‌పల్లి: సంవత్సరం గడుస్తున్నా కొన్ని కాలనీల్లో సీసీ రోడ్లు వేయాలని జోనల్ కమిషనర్, సంబంధిత అధికారులకు వినతిపత్రాలు అందజేసినప్పటికీ పట్టించుకోవడం లేదని కార్పొరేటర్ మహేందర్ అన్నారు. అధికారులు నిర్లక్ష్యపు ధోరణి మార్చుకుని పెండింగ్‌లో ఉన్న సీసీ రోడ్డు పనులను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో బీజేపీ నాయకులతో కలిసి మౌనదీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మూడు నెలలుగా వీధి దీపాలు వెలగడం లేదన్నారు. సంబంధిత అధికారులు, సిబ్బందికి వినతిపత్రాలను అందజేసినా పట్టించుకోవడం లేదన్నారు. మౌన దీక్ష చేస్తున్న మహేందర్, నాయకులను దీక్షా శిబిరం నుంచి పోలీసులు ఠాణాకు తరలించారు.

రక్తదాన శిబిరం

మూసాపేట: దివంగత నాయకులు వడ్డేపల్లి నర్సింగరావు జయంతి సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. మూసాపేటలోని శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయం వద్ద వీఆర్‌ఆర్ సంస్థ, ఒమినీ ఆస్పత్రి సౌజన్యంతో సోమవారం ఏర్పాటు చేసిన శిబిరంలో పలువురు రక్తదానం చేశారు. అనంతరం రక్తదాన చేసిన వారికి వడ్డేపల్లి రాజేశ్వరరావు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో యువ మోర్చా నాయకులు తిరుపతి రెడ్డి, ఇజగల సాయి, వంశీ నేత, దినేష్, అభిమానులు పాల్గొన్నారు.

ఘనంగా వడ్డేపల్లి నర్సింగరావు జయంతి



కూకట్‌పల్లిలోని వడ్డేపల్లి నర్సింగరావు విగ్రహానికి నివాళులర్పిస్తున్న వడ్డేపల్లి రాజేశ్వరరావు, బీజేపీ నాయకులు

కూకట్‌పల్లి: దివంగత నేత వడ్డేపల్లి నర్సింగరావు జయంతి సందర్భంగా సోమవారం కూకట్‌పల్లి తాంధ్ర పాపారాయుడు సెంటర్‌లో వడ్డేపల్లి నర్సింగరావు విగ్రహం వద్ద జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు వడ్డేపల్లి రాజేశ్వరరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అర్శనపల్లి సూర్యారావు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

కేపీహెచ్‌బీ కాలనీలో...

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డేపల్లి రాజేశ్వరరావు రోడ్డు నం.1లోని శ్రీ సరస్వతి శిశుమందిర్‌లో సోమవారం జరిగిన వేడుకల్లో విద్యార్థులకు ఉచితంగా స్కూల్ షూస్ అందజేశారు. అనంతరం స్కూలు విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సరస్వతి శిశుమందిర్ పిల్లలతో తన తండ్రి జయంతి వేడుకలు జరుపుకోవటం సంతోషంగా ఉందన్నారు.

డ్రైనేజీ పనుల పరిశీలన

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి ఎమ్మెల్యే కృష్ణారావు రూ.9లక్షల నిధులతో కుమ్మరిబస్తీలో నిర్మిస్తున్న భూగర్భ డ్రైనేజీ పనులను శనివారం కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ పరిశీలించారు. పనులను నాణ్యతా ప్రమాణాలతో త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని తెలిపారు.

సీవరేజీ పైప్‌లైన్ పనులకు పైపులు సిద్ధం చేశాం

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి: ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం అన్ని విభాగాల అధికారులతో సీవరేజ్ పైప్‌లైన్ నిర్మాణం కోసం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇప్పటికే అన్ని ప్రాంతాల్లో పైప్‌లైన్ నిర్మాణం కోసం ఎక్కడికక్కడ పైపులు సిద్ధం చేశామన్నారు. అందులో వాటర్‌వర్క్స్, జీహెచ్‌ఎంసీ, ఎలక్ట్రిసిటీ అధికారులు సమన్వయం చేసుకొని పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. భవిష్యత్ ప్రణాళికల దృష్ట్యా ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్ పటిష్ట చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. అందులో భాగంగానే పైప్‌లైన్ల నిర్మాణం కోసం నిధులకు ఎక్కడా వెనుకాడకుండా కేటాయిస్తున్నారని తెలిపారు. ప్రజలకు కావాల్సిన మౌలిక సదుపాయాల విషయంలో అధికారులందరూ వారికి అందుబాటులో ఉండి ఎక్కడైనా సమస్య వస్తే వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్‌లు, అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనుల పరిశీలన..

కూకట్‌పల్లి కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణతో కలిసి కూకట్‌పల్లి ప్రధాన రహదారి నుంచి హైటెన్షన్ లైన్ మీదుగా ప్రకాష్‌నగర్ రోడ్డు విస్తరణ పనుల కోసం నివాస సముదాయాల వారికి టీడీఆర్ ఇచ్చేందుకు చర్చించి నిర్ణయం తీసుకున్నామని ఎమ్మెల్యే తెలిపారు. స్థానికంగా నివాసం ఉండే వారు సుముఖత వ్యక్తం చేశారన్నారు.



అధికారులు, కార్పొరేటర్లతో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



ప్రకాష్‌నగర్ రోడ్డు విస్తరణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

ఉపాధి శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



శిబిరంలో పాల్గొన్న కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్, నిర్వాహకులు సుమన్

మూసాపేట: మూసాపేట భరత్‌నగర్ మహిళ మండలి భవనంలో ఖార్డు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఉచిత కుట్టు మెషిన్ శిక్షణ తరగతుల ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథులుగా మూసాపేట మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్, ఫతేనగర్ డివిజన్ కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్, సంస్థ నిర్వాహకులు సుమన్ మల్లాది హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహిళల ఆర్థిక స్వావలంబన కోసం ఖార్డు సంస్థ ఏర్పాటు చేసిన ఉచిత ఉపాధి శిబిరాన్ని మహిళలు సద్వినియోగ పర్చుకోవాలన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న తర్వాత నిర్వాహకులే ఉద్యోగాలు కల్పిస్తారని పేర్కొన్నారు. ఒకవేళ కొంతమంది మహిళలు సంఘటితంగా ఏర్పడితే ఆర్డర్లు కూడా ఇప్పిస్తారని తెలిపారు. ఎమ్మెల్యే కృష్ణారావు ఖార్డు సంస్థ నిర్వాహకులతో మాట్లాడి ప్రతి డివిజన్‌లో ఉచిత నైపుణ్య శిక్షణ తరగతులను ఏర్పాటు చేయించి మహిళల ఉన్నతికి ఎనలేని కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. సీఓ మురళి, సురేష్ నాయుడు, సాంబశివరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, పవన్‌రెడ్డి, సూర్యకళ, హరిత, అనురాధ, మేరీ, ఆదిలక్ష్మి, సుజాత, శాంత అశ్విని పాల్గొన్నారు.

ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా గడప గడపకు బీజేపీ

ఓల్డ్ బోయిన్‌పల్లి: రాబోయే ఎన్నికల్లో కూకట్‌పల్లి నియోజకవర్గంలో బీజేపీ గెలుపే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తున్నట్లు బీజేపీ సీనియర్ నాయకులు వడ్డేపల్లి శరన్‌కుమార్ చౌదరి తెలిపారు. శనివారం ఓల్డ్‌బోయిన్‌పల్లి డివిజన్‌లోని హెచ్‌ఏఎల్ పార్కు, సమతానగర్‌లో ఇంటింటికీ తిరుగుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శరన్‌కుమార్ చౌదరి మాట్లాడుతూ.. డబల్ బెడ్‌రూమ్స్ ఇళ్లు రాక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రేషన్‌కార్డులు, పింఛన్లు, ప్రజలకు కనీస మౌలిక సదుపాయులు కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం, స్థానిక నాయకత్వం విఫలమైందని చెప్పారు. అధికార పార్టీకి చెక్ పెట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో ప్రజలు బీఆర్‌ఎస్‌కు బుద్ధి చెబుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో మూసాపేట కార్పొరేటర్ మహేందర్, మేడ్చల్ అర్బన్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు పన్నాల హరీష్‌రెడ్డి, సీనియర్ నాయకులు వడ్డేపల్లి రాజేశ్వర్‌రావు, శ్రీకర్‌రావు, సూర్యరావు, తిరుపతియాదవ్, సంతోష్‌యాదవ్, సత్యనారాయణ. రవికుమార్‌గౌడ్, లక్ష్మి, సాయి, ఎస్‌కే చౌదరి తదితరులు పాల్గొన్నారు.

జాతి పునర్ నిర్మాణంలో అందరూ భాగస్వాములు కావాలి

కూకట్‌పల్లి: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కేపీహెచ్‌బీ నగర శాఖ ఆధ్వర్యంలో సోమవారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కార్యవర్గ సభ్యులు సందీప్ విచ్చేసి మాట్లాడారు. అందరూ జాతి పునర్ నిర్మాణంలో భాగస్వాములు కావాలని సూచించారు. అదే విధంగా విద్యార్థి పరిషత్ విద్యార్థుల సమస్యలను పాటు సామాజిక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందన్నారు. అదే విధంగా ఏబీవీపీ విద్యార్థుల్లో దేశభక్తిని నింపుతోందన్నారు. అందరిలో జాతీయ వాదాన్ని పెంపొందిస్తూ ముందుకు వెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి రోషన్, సంయుక్త కార్యదర్శి గణేష్, సుధీకర్‌స్టేట్ టెక్నికల్ సెల్ కన్వీనర్ నాగరాజు, జిల్లా గర్ల్స్ కన్వీనర్ భావగానా, ఏబీవీపీ నాయకులు సునీల్, గోపాల్, ఆకాష్, మోక్ష, అనోక్, భరత్, గౌతమ్, కార్తీక్ పాల్గొన్నారు.